

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 15 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 16, డిసెంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# తెలంగాణలో.. బీజేపీ ఘోర పరాజయం!




## నాయకత్వ లోపాలు ఓటమికి మూలం !

**హైదరాబాద్, జై భీమ్ డెస్క్**

తెలంగాణలో పంచాయితీ ఎన్నికల్లో బిజెపి ఘోర పరాజయం పాలైందని జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ అన్నారు. గెలిచిన సర్పంచ్ సీట్ల సంఖ్య చూస్తే పార్టీ నేతలు గాంభీర్యంగా కనిపించినా, వాస్తవంలో మూడో స్థానానికి కూడా చేరుకోలేకపోయారు. ఈ ఫలితాలు చూస్తే రాష్ట్రంలో కాషాయ పార్టీ బలోపేతమవ్వడం ఇప్పట్లో కష్టమేనన్న అభిప్రాయం కలుగుతోంది. ప్రజలు ఎంత హెచ్చరించినా, ఛీకొట్టినా తెలంగాణ బిజెపిలో మార్పు రావడం లేదు. అధికార కాంగ్రెస్‌పై విమర్శలతోనే పార్టీ రాజకీయ ప్రయాణం సాగుతోంది. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్రానికి నిధులు సక్రమంగా విడుదల కావడం లేదు. అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. పక్కన ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి నేతలు కేంద్రం నుంచి ప్రాజెక్టులు, నిధులు రాబట్టుకుంటుంటే, తెలంగాణలో మాత్రం రోడ్ల నిర్మాణం, కంటోన్మెంట్ భూముల బదిలీ వంటి అంశాల్లో పురోగతి లేదు. రాష్ట్రం ఏదైనా కోరితే విమర్శలు తప్ప మరేమీ

- మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

పంచాయితీ ఎన్నికల్లో బిజెపి చతికిలపడింది.. ప్రజలు గట్టి బుద్ధి చెప్పారు!

కేంద్ర మంత్రులు ఉన్నా తెలంగాణకు నిధులు ఎందుకు రావడం లేదు? బిజెపి నిర్లక్ష్యమే కారణమా?

అంతర్గత కుమ్ములాటలు.. బండి సంజయ్-ఈటెల విభేదాలు: బిజెపి అడుగులు ముందుకు పడని పరిస్థితి!

బండి సంజయ్‌ను తప్పించడంతో పార్టీ జోరు తగ్గింది..

అసెంబ్లీ నుంచి పంచాయతీ వరకు ఓటముల దెబ్బ!

ప్రధాని మోడీ హెచ్చరికలు: తెలంగాణ బిజెపి నేతలు మేలుకుంటారా?

ఆంధ్రలో ప్రాజెక్టులు రాబట్టుకుంటున్న బిజెపి.. తెలంగాణలో మాత్రం రోడ్లకు దిక్కు లేదు!

జీహెచ్ఎంసీ నుంచి పంచాయతీ వరకు: బిజెపి పతనం.. ఆత్మపరిశీలన ఎక్కడ?

బీసీ నాయకత్వ డిమాండ్ మళ్లీ తెరపైకి.. తెలంగాణ బిజెపి మార్పునకు సిద్ధమా?

స్వయంకృతాపరాధాలతోనే కాంగ్రెస్ అధికారం సాధించింది.. బిజెపి ఇంకా మేల్కోలేదు!

జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ



## పంచాయతీ ఎన్నికల్లో ఉద్రిక్తత

### ఎన్నికల అధికారిని గదిలో బంధించిన గ్రామస్థులు

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారామపురం గ్రామంలో ఎన్నికల అధికారి నాగరాజును గ్రామస్థులు ఓ గదిలో బంధించిన ఘటన కలకలం రేపింది.

వివరాలు 2లో

## భారత కరెన్సీపై నిషేధం ఎత్తివేసిన నేపాల్

6

రూ. 500, రూ. 200 నోట్ల వినియోగానికి అనుమతి

భారత్-నేపాల్ మధ్య ప్రయాణించే వారికి భారీ ఊరట

రూ.25,000 పరిమితి వరకు నోట్లు తీసుకెళ్లే అవకాశం






## పంచాయతీ పోరులో కాంగ్రెస్ హవా..

రెండో విడతలోనూ అదే జోరు!

సగానికి పైగా సర్పంచ్ స్థానాలు హస్తం కైవసం

గట్టి పోటీనిచ్చి రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్

సిద్దిపేట, జనగామ వంటి జిల్లాల్లో గులాబీ పార్టీ పట్టు

చలిని లెక్కచేయకుండా భారీగా పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లు

5



## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రకు కేంద్రం తెరలేపింది

పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ఉద్దేశం

పథకం పేరుతో పాటు ఆత్మను కూడా మార్చే ప్రయత్నం

పేదలను, రాష్ట్రాలను శిక్షించేలా ని నూతన బిల్లు

కేంద్రం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి

డిమాండ్ చేసిన మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క

వివరాలు 2లో

# పంచాయతీ ఎన్నికల్లో ఉద్రిక్తత

**ఎన్నికల అధికారిని గదిలో బంధించిన గ్రామస్థులు**

**హైద్రాబాద్, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారామపురం గ్రామంలో ఎన్నికల అధికారి నాగరాజును గ్రామస్థులు ఓ గదిలో బంధించిన ఘటన కలకలం రేపింది. ఎన్నికల అధికారి ఏకపక్షంగా వ్యవహరించారని, ఉపసర్పంచ్ పదవిని ముందుగానే ప్రకటించారని గ్రామస్థులు ఆరోపించారు. ఈ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు నాగరాజును గదిలో బంధించడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు సంబరాలు చేసుకుంటుండగా, ఓడిన అభ్యర్థులు కొన్ని ప్రాంతాల్లో ఆందోళనలకు దిగుతున్నట్లు సమాచారం. తమ వద్ద డబ్బులు తీసుకుని వేరే అభ్యర్థులను గెలిపించారని ఆరోపిస్తూ ఓటర్లపై డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తున్నారని వార్తలు వస్తున్నాయి. పలుచోట్ల ఓడిన అభ్యర్థులు గెలిచిన అభ్యర్థులపై దాడులకు పాల్పడటం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

**కామారెడ్డిలో ట్రాక్టర్‌తో దాడి ఘటన....**

కామారెడ్డి జిల్లా సోమార్‌పేటలో హింసాత్మక ఘటన చోటుచేసుకుంది. సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థి బాలరాజును, గెలిచిన సర్పంచ్ పాపయ్య తమ్ముడు చిరంజీవి ట్రాక్టర్‌తో ఢీకొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గెలిచిన అభ్యర్థి వర్గం%-%ఓడిన అభ్యర్థి వర్గాల మధ్య ముందుగా గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. వాటిపై మనసులో పెట్టుకొని చిరంజీవి ఈ దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నేలమాళిగలో బయటపడ్డ అమ్మవారి విగ్రహం.. భక్తుల పోటెత్తింపు



**మంచిర్యాల, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

మంచిర్యాల జిల్లా ముల్కల మండలం నేలమాళిగ గ్రామంలో అమ్మవారి విగ్రహం బయటపడటం స్థానికంగా సంచలనంగా మారింది. ఈ విషయం తెలియగానే పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అక్కడికి తరలివచ్చారు. బయటపడిన అమ్మవారి విగ్రహానికి గ్రామస్తులు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా భక్తులు చేరడంతో ఆ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసి పోయింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు రంగంలోకి దిగి భక్తులు క్యూ లైన్లు పాటించాలని విజ్ఞప్తి చేశారు. కొంతసేపు గుంపును నియంత్రించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. ఇదిలా ఉండగా, ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరం పూజారితో పాటు పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు చేపట్టిన గోదావరి పరిక్రమ యాత్ర డిసెంబర్ 12న మంచిర్యాల జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు ముల్కల మండలం నేలమాళిగలో గోదావరి పుష్కరఘాట్‌కు వెళ్లే మార్గంలో ఒక ప్రదేశాన్ని చూపించి, అక్కడ ఏదో తెలియని శక్తి ఉందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆసక్తి మరింత పెరిగింది. స్థల యజమాని అనుమతి తీసుకుని స్థానికులు ఆ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తవ్వకాలు చేపట్టారు. ఈ తవ్వకాల్లో సింహంపై కూర్చున్న దుర్గాదేవి విగ్రహం బయటపడింది. దీంతో గ్రామస్తులు ఆనందోత్సాహాలతో అమ్మవారికి విశేష పూజలు చేశారు. గ్రామంలో అమ్మవారి విగ్రహం బయటపడటం తమ అదృష్టంగా భావిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనతో నేలమాళిగ గ్రామం భక్తులతో కిటకిటలాడుతూ, ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగుతోంది.

# తెలంగాణలో బిజెపి ఘోర పరాజయం


మొదటి పేజీ తరువాయి

రావడం లేదు. ఇద్దరు మంత్రులు, ఏడుగురు ఎంపీలు ఉన్నా పార్టీకి లాభం కనిపించడం లేదు. అందుకే ప్రధాని మోడీ ఇటీవల తెలంగాణ బిజెపి నాయకత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ఓబీసీ మోర్చా నేతగా రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ ఉన్నా పార్టీ కాంగ్రెస్‌ను తిట్టడమే పనిగా పెట్టుకుంది. ప్రజలను చేరువ చేసే కార్యక్రమాలు లేవు. అంతర్గత కుమ్ములాటలు గతంలో ఎప్పుడూ లేనంతగా పెరిగాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి నేతలు విమర్శలకే పరిమితమవుతున్నారు. ఐదేళ్ల క్రితం జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ స్థానానికి చేరువలో ఉన్న బిజెపి, కాంగ్రెస్‌ను ఒకటి రెండు సీట్లకు పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. బండి సంజయ్ నాయకత్వంలో పార్టీ మరింత దూకుడు ప్రదర్శించింది. కానీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయనను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించడంతో పార్టీ జోరు తగ్గింది. దాని ప్రభావం ఎన్నికల్లో కనిపించి, అధికార ఆశలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు పంచాయితీ ఎన్నికల్లోనూ ప్రజలు గట్టి బుద్ధి చెప్పారు. స్వతంత్రులకు వచ్చిన సీట్ల కంటే తక్కువే దక్కాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో డిపాజిట్ కోల్పోయారు. అయినా పార్టీలో ఆత్మవిమర్శ లేదు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య అంతర్గత విభేదాలు పార్టీ అడుగులు ముందుకు పడకుండా చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం వివిధ పార్టీల నుంచి బలమైన నేతలను చేర్చుకుని ఆశలు పెంచినా, బండి సంజయ్‌ను తప్పించడం, బీఆర్ఎస్‌తో కుమ్మక్కైనట్టు ప్రచారం కావడంతో ప్రజల నమ్మకం కోల్పోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి బిజెపి స్వయంకృతాపరాధమే కారణం. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో బలమైన నేతలను బరిలో దించి ఎనిమిది సీట్లు గెలిచినా, ఆ తర్వాత నివురుగప్పిన అంతర్గత విభేదాలు పార్టీని దెబ్బతీశాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో బలమైన పునాది ఉన్నా, ఎమ్మెల్యే రాజాసింగ్ వంటి నేతలను కోల్పోవడంతో బలం తగ్గింది. కేంద్రంలో అధికారంలో ఉన్నా రాష్ట్రానికి లబ్ధి చేకూర్చలేకపోతున్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయంగా నిలవాలన్న ప్రయత్నం లేదు. బీసీ నాయకత్వం అంశం కూడా తెరపైకి వచ్చింది. లోక్‌సభ తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ పార్టీ పట్టు చూపలేకపోయింది. తాజా పంచాయితీ ఫలితాల్లో ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ పేలవ ప్రదర్శన ఆశ్చర్యం కలిగిస్తోంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ప్రయత్నాలు లేవు. తిరువనంతపురంలో గెలుపొందిన బిజెపి, తెలంగాణలో మాత్రం ఓడిపోవడానికి నేతల లోపభూయిష్ట వైఖరే కారణం.

# కేయూ మాలవియా మిషన్ ఆధ్వర్యంలో ఎన్ఈపీ ఓరియంటేషన్-సెన్సిటైజేషన్ ఆన్‌లైన్ కార్యక్రమం ప్రారంభం

**హన్మకొండ, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం మరియు మాలవియా మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం సంయుక్త ఆధ్వర్యంలో "ఎన్.ఈ.పీ. ఓరియంటేషన్, సెన్సిటైజేషన్" ఆన్‌లైన్ కార్యక్రమం సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైంది. విశ్వవిద్యాలయం తరపున ఈ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. బి. రమ, విభాగ సహాయ ఆచార్యులు డా. డి. రమేష్ సమన్వయం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ, విద్యా వ్యాప్తిలో సమానత్వాన్ని పెంపొందించడంతో పాటు బోధన నాణ్యతను మెరుగుపరచడంలో డిజిటల్ సాంకేతికతకు జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)లో కీలక ప్రాధాన్యం కల్పించిందన్నారు. సౌకర్యవంతమైన, సమ్మిళిత మరియు అభ్యాసకేంద్రీకృత విద్యను ప్రోత్సహించేందుకు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆన్‌లైన్ అభ్యాస సాధనాలు, వర్చువల్ ప్రయోగశాలలు, ఇ-కంటెంట్ వినియోగాన్ని ఎన్ఈపీ ప్రోత్సహిస్తుందని తెలిపారు. భౌగోళిక, సామాజిక%-%ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు బ్లెండెడ్ లెర్నింగ్, డిజిటల్ రిపోజిటరీలు, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్, ఆన్‌లైన్ ఉపాధ్యాయ శిక్షణ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. బోధన, అభ్యాసం, మూల్యాంకనం మరియు పరిపాలనలో సాంకేతికతను సమగ్రంగా అమలు చేయడం ద్వారా విద్యార్థులను డిజిటల్ నైపుణ్యాలతో సిద్ధం చేయడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం మరియు విద్యను భవిష్యత్తుకు సిద్ధం చేయడం ఎన్ఈపీ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానం%-%2020 భారతదేశ విద్యా వ్యవస్థలో ఒక మైలురాయి సంస్కరణగా నిలుస్తుందని అన్నారు. ఉన్నత విద్యను సమగ్ర, బహుళ విభాగ, సమ్మిళిత మరియు నైపుణ్యాధారితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ విధానం రూపొందించబడిందని తెలిపారు. ఈ దార్శనికతను ఆచరణలోకి తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాబోయే ఎనిమిది రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో బహుళ విభాగ విద్య, భారతీయ జ్ఞాన వ్యవస్థలు, విద్యా నాయకత్వం, పాలన, పరిశోధన, ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధి, సమ్మిళిత విద్య, ఐసీటీ ఏకీకరణ, సంస్థాగత స్వయంప్రతిపత్తి, పాఠ్యాంశాల రూపకల్పన, మూల్యాంకనం వంటి ఎన్ఈపీ%-%2020 ప్రధాన అంశాలపై చర్చలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం యూజీసీ కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) అవసరాలకు అనుగుణంగా ఉందని పేర్కొని, పాల్గొనే ఉపాధ్యాయులు సెషన్లలో చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రకు కేంద్రం తెరలేపింది

**పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ఉద్దేశం**
**పథకం పేరుతో పాటు ఆత్మను కూడా మార్చే ప్రయత్నం**
**పేదలను, రాష్ట్రాలను శిక్షించేలా నూతన బిల్లు**
**కేంద్రం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి**
**డిమాండ్ చేసిన మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క**

**హైద్రాబాద్, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ న్యూస్)**

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతో పాటు దాని ఆత్మను, అమలు విధానాన్ని కూడా మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా ఉన్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానం పేదలను, రాష్ట్రాలను శిక్షించేలా ఉందని తీవ్రంగా విమర్శించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును "వికసిత్ భారత్ %-% గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) - వీబీ %-%జి రామ్ జి "గా మార్చే బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో, ఆ బిల్లును మంత్రి సీతక్క తీవ్రంగా తప్పుబట్టారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, గ్రామాల నుంచి వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడం వంటి గొప్ప లక్ష్యాలతో యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటోందని ఆమె మండిపడ్డారు. గతంలో ఈ పథకానికి వంద శాతం నిధులు వెచ్చించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించిలిలి, మిగిలిన 40 శాతం భారం రాష్ట్రాలపై మోపడం పూర్తిగా అన్యాయమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని ఆమె విమర్శించారు. పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా బయటపడుతోందని ఆమె అన్నారు. మొదటి నుంచే ఈ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి వంద రోజుల ఉపాధి కల్పించాల్సి ఉన్నప్పటికీ, బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఏ సంవత్సరంలోనూ 42 రోజులకన్నా ఎక్కువ పని దినాలు కల్పించలేదని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇది చట్ట ఉల్లంఘనకే సమానమని ఆమె వ్యాఖ్యానించారు. ఈ పథకానికి ప్రతి ఏడాది నిధుల్లో భారీ కోత విధిస్తూ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాలరాస్తోందని ఆమె మండిపడ్డారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా తెలంగాణను పేర్కొంటూ, గత ఏడాది రాష్ట్రంలో 12.5 కోట్ల పని దినాలు కల్పించగా, ఈ ఏడాది కేవలం 7.5 కోట్ల పని దినాలకే పరిమితం చేశారని వెల్లడించారు. రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన న్యాయమైన నిధుల వాటాను కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీల పేరుతో కబళిస్తూ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. ఇదే సమయంలో ఉపాధి హామీ పథకంలోనూ రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం పూర్తిగా అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదల ఉపాధి హక్కును కాపాడాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తి నిధులతో, పూర్తి బాధ్యతతో కేంద్ర ప్రభుత్వమే అమలు చేయాలని మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క డిమాండ్ చేశారు.

# యాసింగికి సనిపడా యూరియా

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**

**నిజామాబాద్,డిసెంబర్15(జై భీమ్ న్యూస్):**

జిల్లాలో ప్రస్తుతం యాసంగి సీజన్ పంటల సాగుకు సరిపడా యూరియా, ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. యూరియా కోసం రైతులు రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. అలాగే దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. సోమవారం డిచ్‌పల్లి మండలం సుద్దులం సహకార సంఘం ఎరువుల గోదామును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగిలో అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులతో మాట్లాడిన కలెక్టర్.. ఎరువుల పంపిణీపై ఆరా తీశారు. యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాకు 32 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, క్రమం తప్పకుండా ఎరువుల స్టాక్ జిల్లాకు వస్తోందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువుల కొరత తలెత్తకుండా చూస్తామని భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, తహసీల్దార్ సతీష్, స్థానిక అధికారులు ఉన్నారు.

# ఎల్లంపేట గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహణ




**మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ న్యూస్)**

స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతలు భంగం కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశాల మేరకు మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌ను సీఐ రాజ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, పోలీసు బలగాలు గ్రామంలోని ప్రధాన వీధులు, నివాస ప్రాంతాల్లో పర్యటించాయి. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్లాగ్ మార్చ్‌లో మరిపెడ సర్కిల్‌కు చెందిన ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పోలీసులు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుల అరెస్ట్‌ను ఖండించిన టియూజాక్

**హైదరాబాద్, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ న్యూస్)**




రవీంద్రభారతిలో బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టియూజాక్) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యమకారులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులను టియూజాక్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా టియూజాక్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తికి ప్రభుత్వ లాంఛనాలతో విగ్రహం ఏర్పాటు చేయడం తెలంగాణ సంస్కృతి, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధమని పేర్కొన్నారు. తెలంగాణకు ప్రత్యేకమైన సంస్కృతి, కలలు, పోరాట చరిత్ర, త్యాగాల చరిత్ర ఉన్నాయని, అలాంటి రాష్ట్రంలో సినీ ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేయడం ముమ్మాటికీ అవసరం లేదని వారు స్పష్టం చేశారు. ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టులతో తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయలేరని టియూజాక్ నేతలు హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను వ్యక్తం చేయడం రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. ఈ అరెస్టుల్లో టియూజాక్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్, వర్కింగ్ జర్నలిస్ట్స్ ప్రెసిడెంట్ మోహన్‌బాయి రాగి, ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు గోకికార్ సుధాకర్, టియూకేవీ రాష్ట్ర అధ్యక్షులు వేముల యాదగిరి, మహిళా కన్వీనర్ బాకారం లావణ్య, 1969 తెలంగాణ ఉద్యమకారుడు శంకర్రావు, ఎంబీసీ నాయకులు ప్రభాకర్, టియూజాక్ నాయకులు ఒగ్గిరాల సుజి, లలిత, మాధవీలత, సూర్యకళ, రాణి, బాలలక్ష్మి, కృష్ణ, బి.లలిత తదితరులు ఉన్నారు. అక్రమ అరెస్టులతో తెలంగాణ ఉద్యమాన్ని ఆపలేరని టియూజాక్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి స్పష్టం చేశారు.

# కుష్టి నివారణకు ప్రతి ఇంటి సర్వే: డీఎంహెచ్ఓ డా. బి. సాంబశివరావు





**వరంగల్, డిసెంబర్ 15, 2025(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లాలో కుష్టి వ్యాధి నివారణ లక్ష్యంగా ప్రతి ఇంటిలో సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, లక్షణాలు ఉన్న వారిని గుర్తించి తగిన పరీక్షలు, చికిత్సలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శిక్షణ పొందిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్ శిక్షణ కార్యక్రమం అనంతరం సర్వేకు అవసరమైన మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ, వరంగల్ జిల్లాను కుష్టి నివారణ జిల్లాగా మార్చే దిశగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య పర్యవేక్షకులు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు గృహ సందర్శనలు నిర్వహించి, అనుమానిత మచ్చలు ఉన్నవారిని పరీక్షించి, వైద్యాధికారుల ద్వారా నిర్ధారణ చేయించి అవసరమైన కుష్టి నివారణ మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం 18 డిసెంబర్ 2025 నుంచి 31 డిసెంబర్ 2025 వరకు కొనసాగుతుందని వెల్లడించారు. కుష్టి వ్యాధి సాధారణ వ్యాధుల మాదిరిగానే వచ్చే వ్యాధి అని, దీనిని నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే తగిన చికిత్సలు తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు అవసరమైన చికిత్సలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, డీపీఎంఓలు అనుపమ, వెంకన్న, జయరాజ్, నోడల్ అధికారులు మరియు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్ చుట్టూ కొరివి దయ్యాలే బిఆర్ఎస్ పతనానికి కారణం

**స్టేషన్ ఘనపూర్‌లో కాంగ్రెస్ ఘన విజయం - ప్రజల విశ్వాసమే మా బలం**
**మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**స్టేషన్ ఘనపూర్, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ న్యూస్)**

కేసీఆర్ చుట్టూ కొరివి దయ్యాలు ఉండటమే బిఆర్ఎస్ పార్టీ భ్రష్టుపడడానికి ప్రధాన కారణమని, ఆ కొరివి దయ్యాలలో పెద్దది పల్లా రాజేశ్వర్ రెడ్డేనని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రంగా విమర్శించారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో నాపై, నా కుటుంబంపై వ్యక్తిగతంగా నీచమైన పదజాలంతో దూషించినా, కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల, నా పనితీరుపట్ల ఉన్న విశ్వాసంతో నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఘనంగా గెలిపించారని ఆయన అన్నారు. నియోజకవర్గంలో మొత్తం 143 గ్రామపంచాయతీలు ఉండగా, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 94 స్థానాల్లో గెలుపొందారని, మరో ఆరు స్థానాల్లో కాంగ్రెస్ రెబెల్స్ విజయం సాధించారని తెలిపారు. మొత్తం కలిపి సుమారు 100 గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూల ఫలితాలు వచ్చాయని చెప్పారు. బిఆర్ఎస్ 39 స్థానాల్లో, బీజేపీ ఒకచోట, స్వతంత్రులు మూడు చోట్ల గెలిచారని తెలిపారు. ధర్మసాగర్, పెద్ద పెండ్యాల, వేలేరు, మల్కాపూర్, పల్లగుట్ట, తాటికొండ వంటి పెద్ద గ్రామాలన్నీ కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకే వచ్చాయని, 500 ఓట్లకు తక్కువ ఉన్న కొన్ని చిన్న గ్రామాల్లో మాత్రమే బిఆర్ఎస్ గెలిచిందని పేర్కొన్నారు. ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై, నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారనే స్పష్టమైన నిదర్శనమని అన్నారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని, ఇకపై మరింత జాగ్రత్తగా, పట్టుదలతో నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో రాజయ్య, పల్లా రాజేశ్వర్ రెడ్డి విపరీతమైన ధోరణిలో ప్రచారం చేస్తూ వ్యక్తిగత దూషణలకు దిగజారారని, అయినా రాజకీయ పరిపక్వత కలిగిన నియోజకవర్గ ప్రజలు వారిని పూర్తిగా పట్టించుకోలేదని చెప్పారు. బిఆర్ఎస్‌లో కొన్ని కొరివి దయ్యాల కారణంగా పార్టీ భ్రష్టుపడుతోందని, కేసీఆర్ బయటకు రాలేకపోతున్నారని, కవిత సాక్ష్యాలతో సహా తీవ్ర విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఆ పరిణామాలకు కారణం పల్లా రాజేశ్వర్ రెడ్డేనని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబంలో చిచ్చు పెట్టి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాడని, అందుకే కవిత దూరమైపోయిందని, కేటీఆర్%–%హరీష్ రావు మధ్య కూడా దూరం ఏర్పడిందని విమర్శించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రాజయ్య కంటే ఎక్కువ గ్రామాల్లో పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రచారం చేశాడని, రాజయ్య గ్రామాల్లో తిరిగితే ఓట్లు రావని పల్లా ప్రచారం చేశాడని తెలిపారు. రాజయ్యను పార్టీలోనే జీరో చేయాలన్న కుట్ర జరుగుతోందని, ఇప్పటికైనా రాజయ్య కళ్ళు తెరిచి తన పార్టీలో తనపై ఏం జరుగుతోందో తెలుసుకోవాలని సూచించారు. గ్రామ సమస్యలు పరిష్కరించాలనే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఉంటే, బిఆర్ఎస్ నేతలు మాత్రం కడియం శ్రీహరిని తిట్టడంపైనే సమయం వృథా చేశారని విమర్శించారు. నాపై విమర్శలు చేస్తే రాజకీయంగా ఎలాంటి లాభం ఉండదని, ప్రస్తుతం ఉన్న స్థాయిలోనే శాశ్వతంగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా మరోసారి నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 18న నీడిగొండ సత్యసాయి కన్వెన్షన్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులను సన్మానించి, వారికి మార్గనిర్దేశం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# "ఆర్టీఐ చట్టానికి తూట్లు"

**అధికారుల వైఫల్యం - ప్రజల హక్కుల హననం**
**సివిల్ సప్లై కార్యాలయంలో ఆర్టీఐ బోర్డు గల్లంతు**

**వరంగల్, డిసెంబర్ 15 (జై భీమ్ న్యూస్):**


ప్రజలకు పారదర్శక పాలనను హామీ ఇచ్చే సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే అదే చట్టానికి తూట్లు పొడుస్తున్న దృశ్యం జిల్లా సివిల్ సప్లై కార్యాలయంలో వెలుగుచూసింది. జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోనే ఉన్న ఈ కార్యాలయంలో తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిన ఆర్టీఐ బోర్డు గల్లంతవడం, చట్ట అమలుపై అధికారుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తోంది. ఆర్టీఐ చట్టం%–%2005 ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి వివరాలు, అప్పీల్ అధికారి సమాచారం, దరఖాస్తు విధానం, ఫీజు, గడువు వంటి అంశాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. అయితే సివిల్ సప్లై కార్యాలయంలో ఈ కనీస నిబంధనలకే విలువ ఇవ్వకపోవడం చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘించినట్లేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆర్టీఐ బోర్డు లేకపోవడం వల్ల సమాచారం కోరే సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా పేద, నిరక్షరాస్య ప్రజలు సరైన మార్గదర్శనం లేక అధికారుల దయాధీనులుగా మారుతున్నారు. సమాచారం అడిగితే కొందరు అధికారులు నిర్లక్ష్యంగా స్పందించడం, మరికొందరు ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా మౌనం పాటించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా మారింది. జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోనే ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగుతుండడం గమనార్హం. కలెక్టర్ కార్యాలయం కళ్లముందే ప్రభుత్వ శాఖలు చట్టాలను తుంగలో తొక్కుతుంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంటుందన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. ఆర్టీఐ బోర్డు గల్లంతు ఒక్క సంఘటన కాదు, ఇది మొత్తం పరిపాలనా వైఫల్యానికి అద్దం పడుతున్న ఘటనగా మారింది. ప్రభుత్వాలు పారదర్శకత, జవాబుదారీతనం అంటూ ప్రకటనలు చేస్తుంటే, క్షేత్రస్థాయిలో అధికారులు వాటిని కాగితాలకే పరిమితం చేస్తున్నారని ప్రజా సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. సమాచార హక్కును ప్రజల నుంచి దూరం చేయాలనే ఉద్దేశంతోనే ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయడం లేదన్న అనుమానాలు కూడా బలపడుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి జిల్లా సివిల్ సప్లై కార్యాలయంలో ఆర్టీఐ బోర్డును వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు, ప్రజల హక్కులను కాలరాసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమాచార హక్కు చట్టం కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రజలకు నిజంగా ఆయుధంగా మారాలంటే అధికారుల వైఖరిలో మౌలిక మార్పు తప్పనిసరి అన్న సందేశాన్ని ఈ ఘటన స్పష్టంగా ఇస్తోంది.



# నల్లబెల్లి గ్రామానికి గర్వకారణం

**కన్నీళ్లు, ఆనందం, ఆశల మధ్య మేరుగు హేమలత వీరేశం గౌడ్ ఘన విజయం**



**నల్లబెల్లి, 15 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

నల్లబెల్లి గ్రామ చరిత్రలో మరచిపోలేని రోజుగా ఈ రోజు నిలిచింది. సర్పంచ్ ఎన్నికల్లో మేరుగు హేమలత వీరేశం గౌడ్ 360 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడంతో గ్రామమంతా ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఫలితాలు వెలువడిన క్షణం నుంచే గ్రామంలో సంబరాల సందడి మొదలైంది. బాణాసంచా వెలుగులు, డప్పుల మోతలు, మిఠాయిల పంపిణీతో నల్లబెల్లి ఊరంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ గెలుపు ఒక వ్యక్తికి మాత్రమే కాదుప్రతి గ్రామస్తుడి నమ్మకానికి, ఆశలకు ప్రతీకగా మారింది. గెలుపు వార్త విన్న వెంటనే కొందరు వృద్ధుల కళ్లలో ఆనందకన్నీళ్లు మెరిశాయి. "మన అమ్మాయి గెలిచింది" అంటూ మహిళలు హర్షాతిరేకంతో నినాదాలు చేయగా, యువత నూతన ఆశలతో ముందుకు సాగుతామనే సంకల్పాన్ని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ మేరుగు హేమలత వీరేశం గౌడ్ భావోద్వేగంగా మాట్లాడుతూ ు "ఈ విజయం నా ఒంటరిది కాదు. నాపై నమ్మకం పెట్టిన ప్రతి తల్లి, తండ్రి, అన్న, అక్క, చెల్లి, తమ్ముడి విజయం ఇది. నల్లబెల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా జీవిత లక్ష్యం," అని అన్నారు. గ్రామ అభివృద్ధి, పేదల సంక్షేమం, మహిళల సాధికారత, పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇస్తూ అంకితభావంతో పనిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు. మేరుగు హేమలత వీరేశం గౌడ్ విజయయినల్లబెల్లి గ్రామానికి ఒక కొత్త ఉదయం, కొత్త ఆశ, కొత్త భవిష్యత్.

# మద్యం సేవించి వాహనం నడపటం మీకు, మీ కుటుంబానికి క్షేమం కాదు

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, డిసెంబర్ 15(జై భీమ్ న్యూస్)**




మద్యం సేవించి వాహనం నడపటం ద్వారా వాహనదారుడికే కాకుండా అతని కుటుంబానికీ తీవ్ర నష్టం కలుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగి ప్రాణనష్టం జరుగడమే కాకుండా, ఇరువైపుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక–మానసిక కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆయన తెలిపారు. ప్రమాదాల్లో గాయపడిన కొందరు శాశ్వత అంగవైకల్యానికి గురై జీవితాంతం బాధపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కమిషనర్ వెల్లడించారు. ఇందులో భాగంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, పట్టుబడిన వాహనదారులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నామని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు న్యాయమూర్తులు జైలు శిక్షలు లేదా జరిమానాలు విధిస్తున్నారని అన్నారు. గత వారం ట్రై–సిటీ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 437 కేసులు నమోదు కాగా, కోర్టు ద్వారా రూ.1,58,200 జరిమానా విధించడంతో పాటు 24 మందికి జైలు శిక్షలు పడినట్లు తెలిపారు. వరంగల్ ట్రాఫిక్ పరిధిలో 158 కేసులు నమోదై 14 మందికి జైలు శిక్షలు, రూ.72,900 జరిమానా విధించగా, కాజీపేట పరిధిలో 142 కేసుల్లో 9 మందికి జైలు శిక్షలు, మిగతా కేసుల్లో రూ.79,500 జరిమానా విధించబడింది. హనుమకొండ ట్రాఫిక్ పరిధిలో 137 కేసులు నమోదు కాగా, ఒక్కరికి జైలు శిక్షతో పాటు రూ.5,800 జరిమానా విధించారని వివరించారు. ఇకనైనా వాహనదారులు తమ కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి వాహనం నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష - 68 మందికి జరిమానా

**వరంగల్, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన మొత్తం 72 మంది వ్యక్తులను గౌరవ మేజిస్ట్రేట్ కె. లక్ష్మీనారాయణ ఎదుట హాజరు పరచారు. ఈ కేసులన్నీ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ అడిషనల్ డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో నమోదు చేయబడ్డాయి. న్యాయస్థానం విచారణ అనంతరం గిర్మాజీ పేట్‌కు చెందిన గోపు రాజేష్ (తండ్రి జనార్ధన్), కాశిబుగ్గకు చెందిన దుదాని లకం సింగ్ (తండ్రి హీరాజ్ సింగ్), ఖిలా వరంగల్‌కు చెందిన సబిస్కరి శ్రీధర్ (తండ్రి కృపాజీ) మరియు సంగం మండలం ఎల్గూర్ గ్రామానికి చెందిన గుగులోత్ వెంకన్న (తండ్రి నర్సింహా) అనే నలుగురు నిందితులకు రెండు రోజుల జైలు శిక్ష విధించి హుజురాబాద్ సబ్ జైలుకు పంపించారు. మిగిలిన 68 మంది వ్యక్తులకు మొత్తం రూ.50,500/– జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ప్రమాదకర చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా మద్యం సేవించి వాహనం నడపవద్దని వరంగల్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులు మరోసారి హెచ్చరించారు. ఈ వివరాలను వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రారంభించిన బౌద్ధ మత మార్పిడి ఉద్యమం

## పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు




**వరంగల్, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ న్యూస్)**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలను పటిష్టంగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ నెల 17న వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలో నిర్వహించనున్న మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా, పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ఎస్ సీఆర్పీసీ సెక్షన్ 163 (144 సెక్షన్) ప్రకారం ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడాన్ని నిషేధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు రేపు అనగా డిసెంబర్ 16 ఉదయం 6 గంటల నుండి డిసెంబర్ 17 రాత్రి 8 గంటల వరకు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## ఫిబ్రవరి 12, 13 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణ చరిత్ర 9వ సదస్సు



**హన్మకొండ, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, టూరిజం విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12, 13 తేదీల్లో తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ 9వ సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన సర్క్యులర్‌ను కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, చరిత్ర, టూరిజం విభాగాధిపతి, లోకల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ డాక్టర్ రాజ్ కుమార్ చిలువేరు, యూజీసీ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ ఆచార్య ఆర్. మల్లికార్జున్ రెడ్డి, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సీనియర్ బాధ్యులు ఆచార్య సుదర్శన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ జయప్రకాష్, ట్రెజరర్ డాక్టర్ బండి శ్రీనివాస్ తదితరులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సదస్సు 2026 ఫిబ్రవరి 12, 13 తేదీల్లో కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, టూరిజం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని విభాగాధిపతి డాక్టర్ రాజ్ కుమార్ చిలువేరు తెలిపారు. తెలంగాణ చరిత్రపై లోతైన పరిశోధనలు, చర్చలు జరగనున్న ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ చరిత్రకారులు, పరిశోధకులు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్. చంద్రకళ, డాక్టర్ టి. ఉప్పయ్య, డాక్టర్ కె.వి.ఎస్. నరేందర్, డాక్టర్ ఎ. కుమారస్వామి, డాక్టర్ ఎం.కే. సుమంత్, డాక్టర్ కె. నాగేశ్వరరావు, డాక్టర్ డి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 27-28 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగ స్వర్ణోత్సవ ముగింపు వేడుకలు

**హన్మకొండ, డిసెంబర్ 15 (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ విభాగ స్వర్ణోత్సవ సంబరాల ముగింపు కార్యక్రమాల సందర్భంగా డిసెంబర్ 27, 28 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల సమావేశానికి సంబంధించిన సన్నాహక సమావేశం విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ రెండు రోజుల సమావేశం హనుమకొండ, బాలసముద్రం ప్రాంతంలోని కాళోజి కళాక్షేత్రంలో జరగనుంది. ఈ సమావేశం తొలి రోజున ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన ఆరోబిందో ఫార్మా డైరెక్టర్ ఎం. మదనమోహన్ రెడ్డి, గౌరవ అతిథిగా అమెరికా సంయుక్త రాష్ట్రాల టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ డీన్ డాక్టర్ మన్సూర్ ఖాన్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్‌గా వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి వ్యవహరించనుండగా, ప్యాట్రన్‌గా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం బాధ్యతలు నిర్వహించనున్నారు. నిర్వహణ కమిటీ గౌరవ చైర్మన్‌గా విశ్రాంత ఆచార్య వి. మల్లారెడ్డి, చైర్మన్‌గా ఆచార్య వి. కిషన్, కన్వీనర్‌గా పూర్వ విద్యార్థి డాక్టర్ సాంబా రెడ్డి, అధ్యక్షురాలిగా ఆచార్య జే. కృష్ణవేణి, కన్వీనర్ (2)గా ఆచార్య గాదె సమ్మయ్య వ్యవహరిస్తారని తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆచార్య ఎన్. ప్రసాద్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎ. రామకృష్ణ, ఆచార్య వై. నరసింహా రెడ్డి, టి. రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ వి. స్వరూపా రాణి, డాక్టర్ షాయెదా, ట్రెజరర్‌గా డాక్టర్ బి. నాగరాజు బాధ్యతలు నిర్వర్తిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా నేడు నిర్వహించిన సన్నాహక సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రంతో పాటు విశ్రాంత ఆచార్యులు ఆచార్య జి. అచ్చయ్య, ఆచార్య సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

### భారత సామాజిక చరిత్రలో డిసెంబర్ 16 ఒక మైలురాయి

**హైద్రాబాద్, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**





భారతదేశ సామాజిక చరిత్రలో 1956 డిసెంబర్ 16 ఒక చారిత్రక మలుపు. ఈ రోజు, భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కాకుండా, సామాజిక సమానత్వం, మానవ గౌరవం, న్యాయసమాజ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానాయకుడు డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రారంభించిన బౌద్ధ మత మార్పిడి ఉద్యమం దేశవ్యాప్తంగా ఒక సంఘటిత సామాజిక ఉద్యమంగా రూపుదిద్దుకుంది. ఇది కేవలం మత మార్పిడి సంఘటనగా మాత్రమే కాకుండా, శతాబ్దాలుగా కొనసాగిన కుల ఆధారిత అణచివేతకు వ్యతిరేకంగా సాగిన సైద్ధాంతిక, నైతిక, రాజకీయ విప్లవంగా భారత చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించింది. భారత సమాజంలో కుల వ్యవస్థ ఒక సామాజిక నిర్మాణంగా మాత్రమే కాకుండా, మానవ హక్కులను నిరాకరించే అణచివేత వ్యవస్థగా వేల సంవత్సరాలుగా కొనసాగుతోంది. అస్పృశ్యత, సామాజిక బహిష్కరణ, విద్యా%-%ఆర్థిక అవకాశాల నిరాకరణ వంటి తీవ్రమైన అన్యాయాలను డా. అంబేద్కర్ స్వయంగా అనుభవించారు. ఈ అనుభవాలే ఆయనను కేవలం సంస్కరణవాదిగా కాకుండా, వ్యవస్థాత్మక మార్పును కోరుకునే దృఢమైన సామాజిక తత్వవేత్తగా తీర్చిదిద్దాయి. హిందూ మతంలోని శాస్త్రాలు కుల వ్యవస్థకు నైతిక సమర్థన కల్పిస్తున్నాయని, అటువంటి వ్యవస్థలో సమానత్వం సాధ్యం కాదని ఆయన తన రచనల్లో, ముఖ్యంగా కుల నిర్మూలన వంటి గ్రంథాల్లో, లోతైన విశ్లేషణతో స్పష్టంగా వివరించారు. అందుకే ఆయన “హిందువుగా పుట్టినందుకు బాధపడను, కానీ హిందువుగా చనిపోను” అని ప్రకటించారు. ఈ ప్రకటన ఒక వ్యక్తిగత నిర్ణయం కాదుబీ అది ఒక మహా సామాజిక ఉద్యమానికి ఇచ్చిన దిశానిర్దేశం. డా. అంబేద్కర్ బౌద్ధ మతాన్ని ఎంపిక చేయడం వెనుక లోతైన తాత్విక కారణాలున్నాయి. ఆయన దృష్టిలో బౌద్ధ ధర్మం కులం, జన్మ ఆధారిత అసమానతలను పూర్తిగా తిరస్కరించే ధర్మం. తార్కిక ఆలోచన, కరుణ, నైతికత ఆధారంగా నిలిచిన జీవన తత్వం బౌద్ధం. మానవ గౌరవాన్ని కేంద్రంగా ఉంచిన సామాజిక సిద్ధాంతంగా ఆయన బౌద్ధాన్ని చూశారు. అంబేద్కర్ ప్రకారం బౌద్ధం ఒక మతం కంటే ఎక్కువబీ అది ఒక సామాజిక ప్రజాస్వామ్య సిద్ధాంతం. “మనిషి విలువ అతని పుట్టుకతో కాదు, అతని ఆలోచనలతో నిర్ణయించబడుతుంది” అనే బుద్ధుడి బోధనలు, అంబేద్కర్ సామాజిక న్యాయ తత్వానికి సహజమైన విస్తరణగా నిలిచాయి. 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లోని దీక్షాభూమిలో డా. అంబేద్కర్ స్వయంగా బౌద్ధ మతాన్ని స్వీకరించి, లక్షలాది అనుచరులకు దీక్ష ఇచ్చారు. ఈ సంఘటన భారత చరిత్రలోనే అతిపెద్ద స్వచ్ఛంద మత మార్పిడి ఉద్యమంగా గుర్తింపు పొందింది. అనంతరం, 1956 డిసెంబర్ 16 నుంచి ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా సంఘటితంగా విస్తరించేందుకు కార్యాచరణ ప్రారంభమైంది. అందువల్ల డిసెంబర్ 16ను బౌద్ధ మత మార్పిడి ఉద్యమానికి వ్యవస్థీకృత ప్రారంభ దినంగా చరిత్ర గుర్తిస్తోంది. ఈ ఉద్యమం భారత సమాజంపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. కుల వివక్షకు వ్యతిరేకంగా స్పష్టమైన సిద్ధాంతాత్మక ప్రతిఘటన ఏర్పడింది. దళిత%-%బహుజన సమాజం విద్య, సంఘటిత పోరాటం, రాజకీయ చైతన్యం వైపు అడుగులు వేసింది. ఆత్మగౌరవం, స్వాభిమాన భావన బలపడింది. అంధ విశ్వాసాలకు బదులుగా శాస్త్రీయ దృక్పథం విస్తరించింది. ఈ ఉద్యమం భారత ప్రజాస్వామ్యానికి సామాజిక లోతును అందించిన చారిత్రక ఉద్యమంగా విశ్లేషించబడుతోంది. నేటి భారతదేశంలో ఇంకా కుల వివక్ష, సామాజిక అసమానతలు కొనసాగుతున్న సందర్భంలో, అంబేద్కర్ ప్రారంభించిన బౌద్ధ మత మార్పిడి ఉద్యమం ప్రాసంగికత మరింత పెరిగింది. “విద్యావంతులుగా మారండి, సంఘటితంగా ఉండండి, అన్యాయానికి ఎదురు నిలబడండి” అనే డా. అంబేద్కర్ సందేశం నేటి యువతకు, సామాజిక ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. డిసెంబర్ 16 ు బౌద్ధ మత మార్పిడి ఉద్యమ ప్రారంభ దినాన్ని స్మరించుకోవడం అంటే, డా. అంబేద్కర్ కలగన్న కులరహిత, సమానత్వభరిత, మానవీయ భారత సమాజ నిర్మాణానికి మళ్లీ నిబద్ధత ప్రకటించడమే. ఈ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడం మీడియా, మేధావులు, విద్యాసంస్థలు, యువ నాయకులపై ఉన్న చారిత్రక బాధ్యత.

# ముఖ గుర్తింపు హాజరుతో సమయపాలన, క్రమశిక్షణ, యూనివర్సిటీ ప్రతిష్ట పెంపు

### కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కర్నాటి ప్రతాప్‌రెడ్డి

**వరంగల్, డిసెంబర్ 15 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీలో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేయడం ద్వారా సమయపాలన, క్రమశిక్షణ పెరిగి విశ్వవిద్యాలయ ప్రతిష్ట మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం యూనివర్సిటీ పరిపాలన భవన ప్రాంగణంలో ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఉద్యోగి తన కార్యాలయం లేదా విభాగానికి సంబంధించిన రాక%-%పోకలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ముఖ గుర్తింపు హాజరు వ్యవస్థ సీసీటీవీ పర్యవేక్షణలో కొనసాగుతుందని తెలిపారు. 100 మందికి పైగా ఉద్యోగులు ఉన్న కార్యాలయాలు, విభాగాల్లో ముఖ గుర్తింపు హాజరు పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రెగ్యులర్ మరియు కాంట్రాక్టు అధ్యాపకుల కోసం మొబైల్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నామని, వీటన్నింటినీ యూనివర్సిటీ నెట్‌వర్క్ ఇన్‌చార్జ్ ద్వారా అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా కాకతీయ యూనివర్సిటీ ఈ ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానాన్ని అమలులోకి తీసుకువస్తోందని వైస్ చాన్స్‌లర్ తెలిపారు. ప్రారంభ దశలో సంప్రదాయ హాజరు రిజిస్టర్‌ను కొనసాగిస్తూ, తదుపరి దశలో వాటిని పూర్తిగా తొలగించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం యూనివర్సిటీలో ఏడు ప్రదేశాల్లో ముఖ గుర్తింపు హాజరు పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాస్టల్ ఆఫీస్, ఇంజనీరింగ్ కాలేజ్ (కో-ఎడ్యుకేషన్), ప్రిన్సిపాల్ కార్యాలయం, పరిపాలన భవనం, పరీక్షల విభాగం, ఫార్మసీ కాలేజ్, దూరవిద్య కేంద్రం వాటిలో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం పాల్గొన్నారు. ముఖ గుర్తింపు హాజరు విధానం అమలుకు సమన్వయం చేస్తున్న యూనివర్సిటీ నెట్‌వర్కింగ్ సెల్ సంచాలకులు డాక్టర్ డి. రమేష్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి. రమలను వైస్ చాన్స్‌లర్ అభినందించారు.



# కేయూలో మూడు రోజుల శిక్షణా శిబిరం

### విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపే లక్ష్యం కేయూ వీసీ ప్రో. కె. ప్రతాప్ రెడ్డి

**హన్మకొండ, డిసెంబర్ 15 (జై భీమ్ న్యూస్)**

డిసెంబర్ 21న వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి తెలిపారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయం, కేయూ యోగా సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిక్షణా శిబిరానికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం వైస్ చాన్సలర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రో. కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రో. వి. రామచంద్రం, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రో. మామిడాల ఇస్తారి, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ మరియు యోగా సెంటర్ డైరెక్టర్ ప్రో. ఎస్. జ్యోతి, హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్స్ ప్రో. అచ్చయ్య, డాక్టర్ ఎన్. రాంబాబు, ఎస్. శ్రీధర్, హెల్త్ సెంటర్ మెంబర్ ఇన్‌చార్జ్ ప్రో. ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రో. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రో. రామచంద్రం మాట్లాడుతూ “హార్ట్‌ఫుల్‌నెస్ ఫర్ అకాడమిక్ ఎక్సలెన్స్” అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత పెంపొందించడంలో ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. నిర్వాహకులు ప్రో. మామిడాల ఇస్తారి, ప్రో. ఎస్. జ్యోతి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌ను కేయూ గోల్డెన్ జూబిలీ వేడుకల భాగంగా, డీన్ స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయం ఆధ్వర్యంలో, యోగా సెంటర్ సహకారంతో, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ నిపుణుల మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 4:00 నుంచి 5:30 గంటల వరకు కేయూ క్యాంపస్‌లోని సెనేట్ హాల్‌లో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. కాకతీయ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని కళాశాలలతో పాటు సుబేదారి హనుమకొండలో ఉన్న కేయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమని, రిజిస్ట్రేషన్ కోసం కేయూ వెబ్‌సైట్‌లో లింక్ అందుబాటులో ఉంచనున్నామని, ఈ నెల 17వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. 21న జరిగే ముగింపు కార్యక్రమంలో మూడు రోజులు పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఈ మూడు రోజుల శిక్షణా శిబిరంలో రిలాక్సేషన్, మెడిటేషన్, రీజువెనేషన్ (క్లీనింగ్), కనెక్షన్ విత్ సెల్ఫ్ అంశాలపై థియరీ, ప్రాక్టీస్, చర్చా సెషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, ఒత్తిడి తగ్గించడం, విద్యా ప్రగతితో పాటు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధించడమే ఈ శిబిరం ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.

# కేయూలో మూడు రోజుల శిక్షణా శిబిరం

**విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపే లక్ష్యం**
**కేయూ వీసీ ప్రో. కె. ప్రతాప్ రెడ్డి**

**హన్మకొండ, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ న్యూస్)**

డిసెంబర్ 21న వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి తెలిపారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయం, కాకతీయ యూనివర్సిటీ యోగా సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిక్షణా శిబిరానికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం వైస్ చాన్సలర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రో. కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రో. వి. రామచంద్రం, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రో. మామిడాల ఇస్తారి, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్, యోగా సెంటర్ డైరెక్టర్ ప్రో. ఎస్. జ్యోతి, హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్స్ ప్రో. అచ్చయ్య, డాక్టర్ ఎన్. రాంబాబు, ఎస్. శ్రీధర్, హెల్త్ సెంటర్ మెంబర్ ఇన్‌చార్జ్ ప్రో. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రో. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రో. రామచంద్రం మాట్లాడుతూ "హార్ట్‌ఫుల్‌నెస్ ఫర్ అకాడమిక్ ఎక్సలెన్స్" అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత పెంపొందించడంలో ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు ప్రో. మామిడాల ఇస్తారి, ప్రో. ఎస్. జ్యోతి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌ను కేయూ గోల్డెన్ జూబిలీ వేడుకల భాగంగా, డీన్ స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయం ఆధ్వర్యంలో, యోగా సెంటర్ సహకారంతో, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ నిపుణుల మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 4:00 నుంచి 5:30 గంటల వరకు కేయూ క్యాంపస్‌లోని సెనేట్ హాల్‌లో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. కాకతీయ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని కళాశాలలతో పాటు సుబేదారి హనుమకొండలో ఉన్న కేయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమని, రిజిస్ట్రేషన్ కోసం కేయూ వెబ్‌సైట్‌లో లింక్ అందుబాటులో ఉంచనున్నామని, ఈ నెల 17వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 21న జరిగే ముగింపు కార్యక్రమంలో మూడు రోజులు పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఈ మూడు రోజుల శిక్షణా శిబిరంలో రిలాక్సేషన్, మెడిటేషన్, రీజువెనేషన్ (క్లీనింగ్), కనెక్షన్ విత్ సెల్ఫ్ అంశాలపై థియరీ, ప్రాక్టీస్, చర్చా సెషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, మానసిక ప్రశాంతత, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, ఒత్తిడి తగ్గించడం, సమాజం పట్ల బాధ్యతాభావం పెంపొందించడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. కేయూ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థుల అకాడమిక్ ఎక్సలెన్స్‌తో పాటు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించామని డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రో. మామిడాల ఇస్తారి, యోగా సెంటర్ డైరెక్టర్ ప్రో. ఎస్. జ్యోతి తెలిపారు.

## వృత్తి నైపుణ్యాల పెంపుకు కాకతీయ యూనివర్సిటీ-ఐఎస్ఐఈ ఇండియా భాగస్వామ్యం

**హన్మకొండ, డిసెంబర్ 15, 2025 (జై భీమ్ న్యూస్)**

నోయిడా కేంద్రంగా పనిచేస్తున్న ఇంపీరియల్ సొసైటీ ఆఫ్ ఇన్నోవేటివ్ ఇంజనీర్స్ ఇండియా (ఐఎస్ఐఈ ఇండియా), వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం మధ్య నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ ఆధారిత శిక్షణను బలోపేతం చేయడానికి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా అధునాతన సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలు అందించనున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. డిసెంబర్ 15, 2025న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి సమక్షంలో ఈ అవగాహన ఒప్పంద పత్రాలపై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేసి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం తరఫున రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఐఎస్ఐఈ ఇండియా తరఫున సంస్థ ప్రతినిధి మరియు ఏవీపీ పటేల్ రోహన్ అండే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, మూడు సంవత్సరాల పాటు అమలులో ఉండనున్న ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలు, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ వంటి నూతన యుగ సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు వృత్తి శిక్షణ, పాఠ్యాంశాల రూపకల్పన, సర్టిఫికేషన్, ప్లేస్‌మెంట్ మద్దతు అందించనున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్న్‌షిప్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, హ్యాండ్స్-ఆన్ శిక్షణల ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందిస్తూ పరిశ్రమ%-%విద్యా సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ భాగస్వామ్య ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ సుమలత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎన్. రమణ, డాక్టర్ కే. భిక్షాలు, అకాడమిక్ విభాగ సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ కోలా శంకర్ తదితరులు హాజరయ్యారు.

## ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యం

**రూ.1.70 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**వరంగల్, 15 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున కాజీపేట, హనుమకొండ పరిధిలోని 47వ డివిజన్ బోడగుట్ట, 31వ డివిజన్ శాయంపేట ఎస్సీ కాలనీ, 8వ డివిజన్ గుడి బండల్ ప్రాంతాల్లో సుమారు రూ. 1.70 కోట్ల వ్యయంతో అంతర్గత రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్‌లలో పర్యటించిన ఎమ్మెల్యే నాయిని నేరుగా ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన ప్రతి కాలనీలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని, శంకుస్థాపన చేసిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని ఆయన పేర్కొన్నారు. గతంలో కనీస సదుపాయాలు లేని కాలనీల్లో ప్రస్తుతం మెరుగైన వసతులు కల్పించామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ప్రత్యేక అభివృద్ధి దిశగా ముందుకెళ్తోందని, రానున్న రోజుల్లో ప్రజల భాగస్వామ్యంతో మరింత మెరుగైన పాలన అందిస్తామని భరోసా ఇచ్చారు. బోడగుట్ట గ్రామంలో ప్రధాన రహదారి నుంచి లోపలి ప్రాంతాలకు రోడ్డు వెడల్పు చేయాలని స్థానికులు కోరగా, సంబంధిత అధికారులకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. శాయంపేట దళిత కాలనీలో ఇప్పటికే ఎక్కువగా నూతన రోడ్లు వేశామని, మిగిలిన అన్ని రోడ్లను కూడా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఖిలా వరంగల్‌లో వీధి కుక్క దాడి

**చిన్నారి, వృద్ధురాలికి గాయాలు**



**వరంగల్, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం 40వ డివిజన్ ఉర్సు ప్రాంతంలో వీధి కుక్క ఒక్కసారిగా రెచ్చిపోయింది. ఈ ఘటనలో ఒక చిన్నారి, ఒక వృద్ధురాలు కుక్క దాడికి గురై గాయపడ్డారు. బాధితుల అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రాంతంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా పెరిగిపోతున్నప్పటికీ, గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వీధి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## పంచాయతీ పోరులో కాంగ్రెస్ హవా..

**రెండో విడతలోనూ అదే జోరు!**
**సగానికి పైగా సర్పంచ్ స్థానాలు హస్తం కైవసం**
**గట్టి పోటీనిచ్చి రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్**
**సిద్దిపేట, జనగామ వంటి జిల్లాల్లో గులాబీ పార్టీ పట్టు**
**చలిని లెక్కచేయకుండా భారీగా పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో జరిగిన రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. తొలి విడత తరహాలోనే మలి విడతలోనూ అత్యధిక సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో తన పట్టును నిరూపించుకుంది. ఆదివారం జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు సగానికి పైగా స్థానాల్లో విజయకేతనం ఎగురవేశారు. మొత్తం 3,911 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా, తాజా సమాచారం ప్రకారం కాంగ్రెస్ మద్దతుదారులు 2,200కు పైగా స్థానాలను గెలుచుకున్నారు. మరోవైపు, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా గట్టి పోటీనిచ్చి 1,100కు పైగా స్థానాల్లో విజయం సాధించి రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా ఎదగాలని భావిస్తున్న బీజేపీ సుమారు 250 స్థానాలకే పరిమితమైంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పనిచేయడంతో మెజారిటీ జిల్లాల్లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించింది. అయితే సిద్దిపేట, జనగామ, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బీఆర్ఎస్ సత్తా చాటింది. ముఖ్యంగా మాజీ మంత్రి హరీశ్ రావు నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు అత్యధిక స్థానాలు గెలుచుకున్నారు. నిర్మల్ జిల్లాలో బీజేపీ మెజారిటీ స్థానాలు దక్కించుకుంది. తీవ్రమైన చలిని సైతం లెక్కచేయకుండా ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 85.86 శాతం పోలింగ్ నమోదైంది. కొన్ని చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నిన్న సాయంత్రమే ఓట్ల లెక్కింపు చేపట్టి, గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యుల వివరాలను అధికారులు ప్రకటించారు.

## గాయకుడు బాలు అందరివాడు

**మన తెలుగవాడు కావడం గర్వకారణం**
**స్వరసరస్వతిని స్మరించుకోవడం అదృష్టం**
**బాలు విగ్రహావిష్కరణలో వెంకయ్యనాయుడు**

**హైదరాబాద్,డిసెంబర్ 15(జై భీమ్ న్యూస్):**

ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకమని, బాలును అభిమానింగా గౌరవించుకోవడం తెలుగువారిగా మనకంతా గర్వకారణమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతి లో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాల సుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. తన తండ్రి, ప్రముఖ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం రాజకీయాలకు అతీతంగా ఉండేవారని ఎస్పీ చరణ్ (÷ూఖ అఠజీసజీని) గుర్తుచేసుకున్నారు. ఆయనకు అందరూ ఒకటే అని పేర్కొన్నారు. రవీంద్ర భారతి ఆవరణలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో చరణ్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, తెలుగు ప్రజలు, బాలు విగ్రహం ఏర్పాటుకు నాలుగేళ్లుగా కృషి చేసిన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి అందరితో ఎంత స్నేహపూర్వకంగా ఉండేవారన్న దానికి ఈ కార్యక్రమం ఓ నిదర్శనమన్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ వాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతోపాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

## సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు మత్తులో కాంగ్రెస్ నేతల రెచ్చగొట్టు చర్య



**హైద్రాబాద్, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ నాయకులు హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న ఘటన ఒకటి వెలుగుచూసింది. తనకు వ్యతిరేకంగా పోటీ చేసిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిని ట్రాక్టర్‌తో ఢీకొట్టిన సంఘటన తీవ్ర కలకలం రేపుతోంది. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది%ొ% నన్నెవరు ఏం చేయలేరు" అని బెదిరింపులకు పాల్పడి మరీ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం %-% సోమార్పేట్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అభ్యర్థి బిట్ల బాలరాజుపై గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి, మండల అధ్యక్షుడు సాయిబాబా బాబాయి ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం. ఎన్నికల ఫలితాల అనంతరం ఇంటి ముందు కూర్చున్న బీఆర్ఎస్ అభ్యర్థి బిట్ల బాలరాజును, అతని అనుచరులను, కుటుంబ సభ్యులను ట్రాక్టర్‌తో ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో బీఆర్ఎస్ అభ్యర్థితో పాటు పలువురు అనుచరులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు తక్షణమే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## మోగ్లీ చిత్ర బృందం భద్రకాళీ అమ్మవారి దర్శనం

**ఘన విజయం కోసం ప్రత్యేక పూజలు**



**వరంగల్, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్):**

వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని సోమవారం మధ్యాహ్నం ఇటీవల విడుదలైన మోగ్లీ చిత్రం హీరో రోషన్ కనకాల, హీరోయిన్ సాక్షి మడోల్కర్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చిత్రం ఘన విజయం సాధించాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ స్నపన మండపంలో మహాదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తానుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి రామేశ్వరరావు, గౌండ్ల స్రవంతి, అసంతుల శ్రీనివాస్, పర్యవేక్షకులు కొంతికుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# 3వ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి





**ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**
**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ములుగు జిల్లా, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

3వ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం వెంకటాపురం, వాజేడు ఎంపీడీవో కార్యాలయాల్లో, కన్నాయిగూడెం రైతు వేదికలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావుతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, జోనల్ ఆఫీసర్లు, ఆర్వోలు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి, పోలింగ్ రోజున ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెక్‌లిస్ట్ ప్రకారం ఓటింగ్ సామాగ్రిని క్షుణ్ణంగా పరిశీలించాలని, సర్పంచ్, వార్డు మెంబర్ బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా తనిఖీ చేయాలని సూచించారు. కౌంటింగ్ పూర్తైన వెంటనే సామాగ్రిని సీల్ వేసి భద్రపరచాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సిగ్నల్ అందుబాటులో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా, సిగ్నల్ లేని కేంద్రాల్లో వీడియోగ్రఫీ ద్వారా మైక్రో అబ్జర్వర్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది ఉదయం 10 గంటలలోపు పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని, 17వ తేదీ ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ఖచ్చితంగా ప్రారంభించాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. కౌంటింగ్ ఆలస్యం జరిగితే కారణాలతో సహా వెంటనే ఎన్నికల సంఘానికి తెలియజేయాలని, కౌంటింగ్ పూర్తయిన తర్వాత సాధారణ ఎన్నికల పరిశీలకుల అనుమతితో ఫలితాలను ప్రకటించాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా వాజేడు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి పోలింగ్ సామాగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరును తెలంగాణకే ఆదర్శంగా అభివృద్ధి చేస్తా

**కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి**



**ఆత్మకూరు, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

ఆత్మకూరు మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంతో పాటు తెలంగాణకే ఆదర్శంగా అభివృద్ధి చేసే అవకాశాన్ని ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి పర్వతగిరి మహేశ్వరి రాజుకు ఓటు వేసి ఇవ్వాలని కూడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి కోరారు. సోమవారం ఆత్మకూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, గతంలో మండల కేంద్రానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. తప్పుడు ఆరోపణలు చేసే ముందు, గతంలో తాను చేసిన తప్పులు, ప్రజలకు చేసిన మోసాలను గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మహిళల సమక్షంలో ఆత్మకూరు గ్రామ ప్రజలను అవమానపరిచే విధంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తూ, మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యేకు సూచించారు. ప్రజలు ఇప్పటికే గుణపాఠం చెప్పినా ఆయనలో మార్పు రాలేదని విమర్శించారు. ప్రభుత్వ నిధులతో పాటు అదనపు నిధులు కూడా తీసుకొచ్చి ఆత్మకూరు మండల కేంద్రాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయడం తన బాధ్యత అని వెంకటరామిరెడ్డి భరోసా ఇచ్చారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని, తన మాటపై నమ్మకంతో ఓటు వేసి పర్వతగిరి మహేశ్వరిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆత్మకూరుకు అవసరమైన ఇందిరమ్మ గృహాలు, గీతా నేత కార్మికులు, వృద్ధులు, వితంతువులకు కొత్త పింఛన్లు త్వరలోనే మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే నాయకులకు తగిన పదవులు కల్పిస్తామని, గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించి మహేశ్వరిని ఘన విజయం సాధింపజేయాలని పిలుపునిచ్చారు.

## 3వ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**ఎన్నికల విధుల్లో అప్రమత్తత తప్పనిసరి**
**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద**





**వరంగల్ జిల్లా నర్సంపేట, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం నర్సంపేట ఎంపీడీఓ కార్యాలయంలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, జోనల్ ఆఫీసర్లు, ఆర్వోలు, మండల అధికారులతో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా, నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నిర్వహించాలని సూచించారు. ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి, పోలింగ్ రోజున ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ సిబ్బంది చెక్‌లిస్ట్ ప్రకారం ఓటింగ్ సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, సర్పంచ్, వార్డు మెంబర్ బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. కౌంటింగ్ పూర్తయిన అనంతరం సామగ్రిని సక్రమంగా సీల్ వేసి డిపాజిట్ చేయాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్‌కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ల ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. మూడవ విడత ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది మంగళవారం ఉదయం 10 గంటల లోపు పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని, అక్కడ మెటీరియల్ తీసుకుని కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని ఆదేశించారు. డిసెంబర్ 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్ సదుపాయం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే సాధారణ ఎన్నికల పరిశీలకుల అనుమతితో ఫలితాలను ప్రకటించాలని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, సుమ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డీబీసీడీవో పుష్పలత, డీఎస్సీడీవో భాగ్యలక్ష్మి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, జోనల్ ఆఫీసర్లు, ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## భారత కరెన్సీపై నిషేధం ఎత్తివేసిన నేపాల్

**రూ. 500, రూ. 200 నోట్ల వినియోగానికి అనుమతి**
**భారత్-నేపాల్ మధ్య ప్రయాణించే వారికి భారీ ఊరట**
**రూ.25,000 పరిమితి వరకు నోట్లు తీసుకెళ్లే అవకాశం**

**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**

భారత్–నేపాల్ మధ్య ప్రయాణించే వారికి నేపాల్ ప్రభుత్వం శుభవార్త అందించింది. భారత కరెన్సీకి చెందిన రూ.200, రూ.500 నోట్లను తమ దేశంలోకి తీసుకురావడానికి, తీసుకెళ్లడానికి అనుమతిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం నేపాల్, భారత పౌరులిద్దరికీ వర్తిస్తుంది. కేబినెట్ సమావేశం అనంతరం ప్రభుత్వ అధికార ప్రతినిధి, సమాచార శాఖ మంత్రి జగదీశ్ ఖరేల్ ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) నవంబర్ 28న జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం, ఇరు దేశాల పౌరులు రూ.25 వేల పరిమితి వరకు ఈ నోట్లను తమ వెంట ఉంచుకోవచ్చు. ఈ నిర్ణయం వల్ల వైద్య చికిత్సల కోసం భారత్‌కు వచ్చే నేపాల్ పౌరులకు, అలాగే నేపాల్‌ను సందర్శించే భారత పర్యాటకులకు, యాత్రికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని నేపాల్ రాష్ట్ర బ్యాంక్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటి వరకు రూ.100 కంటే ఎక్కువ విలువైన భారత నోట్లను కలిగి ఉండటం నేపాల్‌లో చట్టవిరుద్ధం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2016 నవంబర్‌లో భారత్ రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన తర్వాత నేపాల్ కూడా ఆ నోట్ల వినియోగాన్ని నిషేధించింది. ఆ సమయంలో మార్పిడి కాని సుమారు రూ.5 కోట్ల విలువైన పాత నోట్లు ఇప్పటికీ నేపాల్ బ్యాంకింగ్ వ్యవస్థలోనే ఉన్నాయని అక్కడి సెంట్రల్ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి. తాజా నిర్ణయంతో సరిహద్దు ప్రాంతాల ప్రజల దైనందిన కార్యకలాపాలు సులభతరం కానున్నాయి.

## ఉత్తరాదిలో పెరిగిన చలి

**ఢిల్లీలో పొగమంచుతో విమానాల ఆలస్యం**

**న్యూఢిల్లీ,డిసెంబర్ 15(జై భీమ్ న్యూస్):**



ఉత్తర భారతదేశాన్ని చలి గడ గడలాడిస్తుంది. రాజధాని ఢిల్లీని పొగమంచు కప్పేసింది. దీంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఢిల్లీ సహా పంజాబ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పడిపోవడంతో విపరీతమైన పొంగ మంచు కమ్ముకోవడంతో చలి తీవ్రత పెరిగిపోయింది. ఉదయం పూట హైవే పై దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని. దీంతో వాహనదారులు ఎంతో ఇబ్బందిపడుతున్నారు. ఢిల్లీ–ఎన్సీఆర్ ప్రాంతంలో పొగమంచి విపరీతంగా కమ్మేసింది. దీంతో విమాన, రైలు రాకపోకలపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఒకేసారి 100 కు పైగా విమానాలను రద్దు చేసినట్లు తెలుస్తుంది. అంతేకాదు 300 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు సమాచారం. మరోవైపు పొగమంచు కారణంగా సుమారు వంద రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఢిల్లీలో పొగమంచు పరిస్థిసి నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్ పోర్ట్ ప్రయాణికులకు కీలక సూచన జారీ చేసింది. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానాల స్టేటస్ చెక్ చేసుకోవాలని తెలిపింది. ఎయిర్‌లైన్ సిబ్బంది వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, ఢిల్లీ విమానాశ్రయ ఆధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపింది. భద్రతా ప్రోటోకాల్ కు అనుగుణంగా పనిచేస్తున్నాయని ఎయిర్‌లైన్స్ పేర్కొంది. మరోవైపు ఇండిగో, ఎయిర్ ఇండియా వాతావరణ పరిస్థితిలు దృష్ట్యా పలు విమానాలు రద్దు కాగా, మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని తెలిపింది. విమానాల స్టేటస్ గురించి తెలుసుకోవాలంటే వెబ్ సైట్స్ కి వెళ్లి చెక్ చేసుకోవాల్సిందిగా సూచించింది.

## జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను సమీక్షించిన డీఈఓ ఎల్.వి. గిరిరాజ్ గౌడ్





**హన్మకొండ, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

ఈనెల 18 నుంచి 20 వరకు హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్ (టీవీ టవర్ సమీపంలో) నిర్వహించనున్న హనుమకొండ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ సోమవారం సమీక్షించారు. జిల్లా సైన్స్ అధికారి ఎన్. శ్రీనివాస స్వామి అధ్యక్షతన సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్‌లో జరిగిన సమావేశంలో వివిధ కమిటీల కన్వీనర్లు, కో–కన్వీనర్లు, సభ్యులను ఉద్దేశించి డీఈఓ మాట్లాడారు. సైన్స్ ఫెయిర్ నిర్వహణకు సమయం తక్కువగా ఉన్నప్పటికీ, ఎన్నికల విధుల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బిజీగా ఉన్నా కూడా తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌ను సందర్శించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులను ఫెయిర్‌కు తీసుకువచ్చే సమయంలో భద్రతకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. సందర్శన షెడ్యూల్‌ను కూడా ఈ సందర్భంగా వెల్లడించారు. 19వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు హనుమకొండ, హసన్‌పర్తి, ఆత్మకూరు మండలాల పాఠశాలల విద్యార్థులు, అదే రోజు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరకాల, శాయంపేట, భీమదేవరపల్లి, వేలేరు మండలాల విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. అలాగే 20వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు కమలాపూర్, ఎల్కతుర్తి, నడికుడ మండలాల పాఠశాలల విద్యార్థులు, అదే రోజు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు దామెర, ధర్మసాగర్, కాజీపేట, ఐనవోలు మండలాల విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌ను సందర్శించాలని సూచించారు. ఈ సమావేశంలో సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల అధినేత నారాయణరెడ్డి, వడుప్సా ప్రతినిధులు, హనుమకొండ ఎంఈఓ నెహ్రూ నాయక్, హసన్‌పర్తి ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, కాజీపేట ఎంఈఓ మనోజ్ కుమార్, సీఎంఓ బద్దం సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్న సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల భవనాలను పరిశీలించారు.

# రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో హసన్‌పర్తి మండలంలో కాంగ్రెస్ దూకుడు

**హసన్‌పర్తి, 15 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల అధికారి, డీసీఓ సంజీవరెడ్డి తెలిపారు. ఈ రెండో విడత ఎన్నికల్లో మొత్తం 20,260 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 2 సర్పంచ్ స్థానాలు, 29 వార్డు మెంబర్ స్థానాలు ఏకగ్రీవంగా నిర్ణయించబడగా, మిగిలిన 13 సర్పంచ్, 109 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలకు 50 మంది, వార్డు మెంబర్ స్థానాలకు 280 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం లభించింది. కాంగ్రెస్ మద్దతుతో 7 మంది సర్పంచ్‌లు విజయం సాధించగా, బీఆర్ఎస్ మద్దతుతో 2 మంది, బీజేపీ మద్దతుతో ఒకరు, స్వతంత్ర అభ్యర్థులు 5 మంది సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. సీతంపేట క్లస్టర్ పరిధిలో సీతంపేట నుంచి రమ్య భగవాన్ రెడ్డి (బీఆర్ఎస్), గంటూర్‌పల్లి నుంచి రాకేష్ రెడ్డి (స్వతంత్ర), పెంబర్తి నుంచి తాళ్లపల్లి కుమారస్వామి (బీజేపీ) సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. అనంతసాగర్ క్లస్టర్‌లో అనంతసాగర్ నుంచి వెన్నెల దయాకర్ (కాంగ్రెస్), మడిపల్లి నుంచి బుర్ర రంజిత్ కుమార్ (బీఆర్ఎస్), జయగిరి నుంచి తాళ్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ (స్వతంత్ర) గెలుపొందారు. నాగారం క్లస్టర్‌లో నాగారం నుంచి సందరాజు లావణ్య సంతోష్ (కాంగ్రెస్), సీతానగారం నుంచి కూకట్ల సునీత రమేష్ (కాంగ్రెస్), సూధన్‌పల్లి నుంచి ఆకారపు లచ్చమ్మ లింగస్వామి (స్వతంత్ర) సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. సిద్ధాపూర్ క్లస్టర్‌లో సిద్ధాపూర్ నుంచి బొక్క హరీష్ (స్వతంత్ర), బైరంపల్లి నుంచి కల్లెబోయిన సురేందర్ (కాంగ్రెస్), హరిచంద్ర నాయక్ తండా నుంచి నునావత్ దేవేందర్ (కాంగ్రెస్) విజయం సాధించారు. మల్లారెడ్డిపల్లి క్లస్టర్‌లో మల్లారెడ్డిపల్లి నుంచి గాజు కృష్ణవేణి (కాంగ్రెస్), అర్వపల్లి నుంచి అంబాల ప్రభాకర్ (కాంగ్రెస్), కొత్తపల్లి నుంచి దండ్రి సాంబయ్య (కాంగ్రెస్) ఏకగ్రీవంగా సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. అదేవిధంగా కొత్తపల్లిలో పెరుమాళ్ల చిరంజీవి, గుంటూర్‌పల్లిలో పోరెడ్డి వాణి, పెంబర్తిలో కొయ్యడ దీపిక, సీతానగారంలో క్షుద్ర భరత్ రెడ్డి, బైరంపల్లిలో సంగరబోయిన శ్రీకాంత్, సిద్ధాపూరులో కె. సాయి ప్రసన్న, హరిచంద్ర నాయక్ తండాలో ఎన్. అనిల్ కుమార్, జయగిరిలో భూక్య అరుణ్ కుమార్, సూధన్‌పల్లిలో ఆళ్ల దేవేందర్, మడిపల్లిలో కాందారి ప్రదీప్, అనంతసాగర్‌లో బండ దామోదర్ రెడ్డి, సీతంపేటలో బండారి సాగర్, మల్లారెడ్డిపల్లిలో ఒంటెల కుమారస్వామి, అర్వపల్లిలో మేడిపల్లి అఖిల్‌లు ఉపసర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. మొత్తంగా హసన్‌పర్తి మండలంలో జరిగిన రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన పైచేయి లభించిందని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

# జోర్డాన్ చేరుకున్న ప్రధాని మోడీ

**ఘనంగా స్వాగతించిన భారత సంతతి ప్రజలు**



**అమ్మాన్,డిసెంబర్15(జై భీమ్ న్యూస్) :**

భారతీయ సంతతి భారత్–జోర్డాన్ సంబంధాలకు గణనీయమైన కృషి చేస్తున్నారని భారత ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రధాని మోదీకి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో భారతీయ సంతతి నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మూడు దేశాల పర్యటనలో భాగంగా సోమవారం మొదటి జోర్డాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీని హోటల్ వద్ద జోర్డాన్ లోని భారత సంతతికి చెందిన వారు భారత జాతీయ జెండాను చేతబట్టి ప్రధాని మోదీకి నమస్కరించి స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని వారిని ప్రేమతో పలుకరించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ డిసెంబర్ 15 నుంచి 18 వరకు జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ మూడు దేశాల్లో పర్యటిస్తారు. ఈ పర్యటన ద్వారా ఆయా దేశాలతో పురాతన సంస్కృతిక సంబంధాలతో పాటు ఆధునిక ద్వైపాక్షిక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాలన్నది ప్రధాని పర్యటన ప్రధాన లక్ష్యం. ప్రధాని మోదీ.. జోర్డాన్ సందర్శన భారత్–జోర్డాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతోంది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఎఎ ఇబ్న్ అల్ హుస్సేన్, ఆ దేశ ప్రధాని జాఫర్ హసన్‌లతో భేటీ కానున్నారు. జోర్డాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటిస్తారు.

# ఎం.పి.హెచ్.డబ్ల్యు పరీక్షా ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు

**విద్యార్థినులకు కలెక్టర్ మిఠాయిల పంపిణీ**

**ఖమ్మం,డిసెంబర్15(జై భీమ్ న్యూస్) :**

అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలకు కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం అవుతాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎం.పి.హెచ్.డబ్ల్యు పరీక్షా ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు కైవసం చేసుకున్న మహిళా ప్రాంగణం విద్యార్థినులకు కలెక్టర్ మిఠాయిలు పంచి అభినందించారు. రాష్ట్రస్థాయిలో 2, 4, 5, 7, 8, 10 ర్యాంకులు.. జిల్లా స్థాయిలో మొదటి 15 ర్యాంకులు సాధించారు. గత మూడేళ్లుగా వరుసగా రాష్ట్రస్థాయి ర్యాంకులను కైవసం చేసుకోవడానికి విద్యార్థినులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్న మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేతను కలెక్టర్ ప్రశంసించారు. పేద విద్యార్థినులు, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వారు స్థానిక మహిళా ప్రాంగణంలో చదువుకొని రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు చిన్నప్పుడే ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని, అందుకు అనుగుణంగా శ్రమిస్తే తప్పకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని, దీనికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు.

# పంచాయితీ ఎన్నికలతో కాంగ్రెస్ పతనం

**బిఆర్ఎస్ రెండోవిడతలోనూ అద్భుత ఫలితం**
**కాంగ్రెస్ మోసాలతో ప్రజలు విసుగెత్తారు**
**రేవంత్ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత స్పష్టం**
**పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపిన కెటిఆర్**

**హైదరాబాద్,డిసెంబరు15(జై భీమ్ న్యూస్) :**



రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుందన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ సత్తా చాటిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు. అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఇక కాలం చెల్లిందని ప్లలె ప్రజలు తమ ఓటు ద్వారా మరోసారి తేల్చిచెప్పారని అన్నారు. ప్రభుత్వ పెద్దలు ప్రాతినిథ్యం వహించే నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం, రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనమని పేర్కొన్నారు.రేవంత్ రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలకు తోడు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే, కాంగ్రెస్ కు ఉరితాళ్లుగా మారి ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయని కేటీఆర్ తెలిపారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే అధికార పార్టీ దుస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదని వ్యాఖ్యానించారు. అరాచక పాలనతో తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రంచేస్తున్న రేవంత్ రెడ్డికి పంచాయతీ ఎన్నికల్లో వస్తున్న ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివని అన్నారు. నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, పల్లె పల్లెనా అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమని అన్నారు.కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్త హస్తం అని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిన నేపథ్యంలో ఇక సీఎం రేవంత్ అసమర్థ పాలనలో అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. రెండేళ్లుగా కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అరాచకాలు, మోసాలు, అవినీతి కుంభకోణాలపై అనునిత్యం బీఆర్ఎస్ సాగిస్తున్న సమరాన్ని గుండెల నిండా ఆశీర్వదిస్తున్న తెలంగాణ సమాజానికి శిరస్సు వంచి పాదాభివందనలు తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి విడిపించే ఈ పోరాటాన్ని తమ భుజాలపై మోస్తున్న గులాబీ సైనికులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని భరోసానిచ్చారు. నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతం అన్నారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుంది' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# బిజెపి నుంచి కూతురు సర్పంచ్

**బిఆర్ఎస్ నుంచి తండ్రి ఉప సర్పంచ్**

జనగామ,డిసెంబరు15(ఆర్ఎన్ఎ):రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో పలు ఆసక్తికర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా జనగామ జిల్లా వెంకిర్యాల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వెంకిర్యాలలో బీజేపీ బలపరిచిన గొల్లపల్లి అలేఖ్య సర్పంచ్‌గా విజయం సాధించగా, ఆమె తండ్రి గొల్లపల్లి పర్శయ్య ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నికల్లో వార్డు సభ్యులు బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు సమానంగా మద్దతు పలకడంతో సర్పంచ్ అలేఖ్య తన ఓటును బీఆర్ఎస్ మద్దతుదారుడైన తన తండ్రి గొల్లపల్లి పర్శయ్యకు వేయడంతో బీఆర్ఎస్ ఉప సర్పంచ్‌గా తండ్రి, సర్పంచ్‌గా కుమార్తె గెలుపొందడం విశేషం.

# సర్పంచ్‌గా 140 ఓట్లతో గెలుపు

**వార్డు మెంబర్‌గా ఏకగ్రీవం**
**ఉప్పుమడుగులో కొత్తకొంత రోజా రికార్డు**

**జగిత్యాల,డిసెంబరు15(ఆర్ఎన్ఎ) :**

రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్‌గా, వార్డు మెంబర్‌గా ఓ మహిళ విజయం సాధించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఉప్పుమడుగు సర్పంచ్‌గా, ఆరో వార్డు సభ్యురాలిగా కొత్తకొండ రోజా నవీన్ పోటీచేశారు. ఆరో వార్డుకు నామినేషన్లు రాకపోవడంతో రోజా ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆమె ఏకగ్రీవమయ్యారు. మరోవైపు ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో రోజా సర్పంచ్‌గానూ గెలుపొందారు. తన సమీప అభ్యర్థిపై 140 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. దీంతో అటు వార్డు మెంబర్‌గా, ఇటు సర్పంచిగా ఎన్నికై డబుల్ విక్టరీ సొంతం చేసుకున్నారు. అయితే ఆమె వార్డు మెంబర్ పదవికి రాజీనామా చేయనున్నారు. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్తా, మామలతో కోడళ్లు సవాల్ విసిరి విజయం సాధించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం శ్రీరామ్‌నగర్ సర్పంచ్ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. సర్పంచ్ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకు, కోడలు నామినేషన్ వేయగా, కొడుకు తాళ్లపెల్లి శ్రీరామ్‌గౌడ్ విత్‌డ్రా చేసుకున్నారు. కోడలు తాళ్లపెల్లి రాధిక మాత్రం ఉపసంహరించుకోలేదు. బరిలో మామ తాళ్లపల్లి సత్యనారాయణగౌడ్, కోడలు రాధిక నిలిచారు. ఆదివారం ఎన్నికల్లో మామపై రాధిక 14 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం గన్‌శ్యాందాస్‌నగర్ గ్రామ సర్పంచ్ స్థానానికి అత్తాకోడళ్లు పోటీపడ్డారు. అత్త సూర నర్సమ్మపై కోడలు సూర రమ 18 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. గ్రామంలో మొత్తం 1906 ఓట్లు పోలవగా, సూర రమకు 874, సూర నర్సమ్మకు 856 ఓట్లు పోలయ్యాయి.

# వార్డు మెంబర్‌గా గెలుపు..

**గుండెపోటుతో అర్థరాత్ర మృతి**

**నాగర్‌కర్నూల్,డిసెంబరు15(ఆర్ఎన్ఎ):**

నాగర్ కర్నూల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన ఓ వ్యక్తి హఠాత్తుగా మృత్యువాత పడటం స్థానికంగా విషాదం నింపింది. ఈ విషాదకర సంఘటన బిజినపల్లి మండలం వెంకటాపూర్‌లో గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రెండో విడుత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గ్రామానికి చెందిన జుర్రు మహేష్ యాదవ్ (34) వార్డు మెంబర్ గా పోటీ చేసి ఆదివారం విజయం సాధించాడు. అయితూ అనూహ్యంగా అర్ధరాత్రి నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య లావణ్య తో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు. మహేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తిరుమలలో ఛైర్మన్ ఆకస్మిక తనిఖీలు

**సౌకర్యాలపై భక్తులతో ఆరా**

**తిరుమల,డిసెంబరు15(ఆర్ఎన్ఎ):**

తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు ఆకస్మిక తనిఖీలు చేశారు. సామాన్యభక్తులు ఉచిత వసతి పొందే పీఏసిలలో ఛైర్మన్ తనిఖీలు చేశారు. లాకర్లు, కళ్యాణకట్ట, భోజనశాలలో క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. సౌకర్యాలపై భక్తుల అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దాత మంతెన రామలింగరాజు సహకారంతో త్వరలో మరింత అత్యాధునిక సౌకర్యాలతో టీటీడీ పీఏసిలను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వైకుంఠద్వార దర్శనాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. డిసెంబర్ 30వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు జరగనున్నాయని తెలిపారు. మొదటి మూడురోజులకు ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా టోకన్లు కేటాయించామని పేర్కొన్నారు. మిగతా 7 రోజులు సామాన్యభక్తులు ఎలాంటి టోకన్లు లేకపోయినా సర్వదర్శనం ద్వారా వైకుంఠద్వార దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాల పై ప్రత్యేక దృష్టి పెట్టమని తెలిపారు. రేపు 50 అజెండా అంశాలపై పాలకమండలి సమావేశం జరగనుందని తెలిపారు. దివ్యవృక్షాల ప్రాజెక్టు పై రేపు జరగబోయే పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. ఏడు నెలలకు అవసరాలకు సరిపడా బ్లేడులను ప్రముఖ బ్లేడు తయారీ సంస్థ 17వ తేదీ విరాళంగా అందజేయనున్నారని తెలిపారు.

# స్థానికంలో కాంగ్రెస్‌నే గెలిపించండి

**పలు ప్రాంతాల్లో మంత్రి వివేక్ ప్రచారం**

**ఆదిలాబాద్,డిసెంబర్15(జై భీమ్ న్యూస్):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. డిసెంబర్ 17న జరగనున్న మూడో విడత పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జైపూర్ మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి వివేక్ క్యాంపెయినింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే రేషన్ ద్వారా సన్న బియ్యం ఇస్తోన్న ఏకైక రాష్ట్ర తెలంగాణ అని అన్నారు. 10 ఏండ్లుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వని రేషన్ కార్డులను అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇచ్చామని చెప్పారు. జైపూర్ పవర్ ఎ÷–లాంట్?లో కొత్తగా 800 మెగా వాట్ల పవర్ ఎ÷–లాంట్?ను నిర్మించనున్నారని.. అందులో స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చెన్నూర్లో ఏటీసీ సెంటర్?ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామని మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అన్నింటిని అమలు చేసిందన్నారు. ప్రతీ ఒక్క అర్హుడికి సంక్షేమ పథకాలు అందజేస్తుందని తెలిపారు.

# చెదిరిన సర్పంచ్ కల

**విఆర్ఎస్ తీసుకున్న ఎస్ఐకి ఓటమి**

**కోదాడ,డిసెంబర్15(జై భీమ్ న్యూస్):**




ఐదు నెలల సర్వీస్ మిగిలి ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి సర్పంచ్‌గా పోటీ చేసిన ఎస్ఐ ఓడిపోయారు. తన సర్పంచ్ కలను నెరవేర్చుకోలేక పోయారు. ఈ ఘటన కోదాడ మండలంలో వెలుగుచూసింది. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేసిన వెంకటేశ్వర్లు ఓటమి పాలయ్యారు. రెండవ విడత ఎన్నికల్లో ఆయన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన గుడిబండ గ్రామంలో ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి.. రేషన్ డీలర్ అయిన నాగయ్య చేతిలో 10 ఓట్ల తేడాతో వెంకటేశ్వర్లు ఓడిపోవడం గమనార్హం. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సూర్యాపేట జిల్లా కోదాడ ఎస్సై పోస్ట్ నుంచి వెంకటేశ్వర్లు వీఆర్ఎస్ తీసుకున్నారు. కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన పులి వెంకటేశ్వర్లు కోదాడ టౌన్ లో ఎస్సైగా పని చేసేవారు. కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరిన ఆయన కష్టపడి పైకొచ్చారు. ఎస్సైగా పదోన్నతి పొందారు. ఐదు నెలల సర్వీస్ మిగిలి ఉండగానే ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ నిర్ణయం తీసుకుని ఎన్నికల బరిలోకి దిగారు. తాను పుట్టి పెరిగిన గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పిన ఆయనకు గ్రామస్తులు అండగా నిలవకపోవడం గమనార్హం.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE



# ఫీమేల్ సెంట్రిక్ రోల్‌లో భాగ్యశ్రీ

మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఆంధ్ర కింగ్ తాలూకా, కాంతా సినిమాలలో కూడా మెరిసింది. కెరీర్లో అతితక్కువ సమయంలోనే క్రేజీ ఆఫర్ కొట్టేసింది. తాజా టాక్ ప్రకారం భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ సెంట్రిక్ సినిమాను లైన్లో పెట్టిందట. అంతేకాదు వన్ ఆఫ్ ది లీడింగ్ ప్రొడక్షన్ హౌస్ స్వప్నాదత్, ప్రియాంకా దత్ స్వప్నా సినిమా బ్యానర్‌పై ప్రతిష్టాత్మక సినిమాను తెరకెక్కిస్తున్నారు. కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు చేయడంలో ఎప్పుడూ ముందుంటుంది ఈ బ్యానర్. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్నాడు. పవర్ ఫుల్ ఉమెన్ సెంట్రిక్ స్టబెక్టుతో స్క్రిప్ట్ రెడీ చేశాడట రమేశ్. ఇప్పటిదాకా గ్లామరస్ రోల్స్ లో మెరిసిన భాగ్యశ్రీని ఇక నటనకు ఆస్కారమున్న పాత్రలో చూపించబోతున్నాడట డైరెక్టర్. మహారాష్ట్రలోని ఛత్రపతి శంబాజీనగర్‌కు చెందిన ఈ భామ హిందీ ప్రాజెక్టులు యారియాన్, చందూ చాంపియన్‌లో కామియో రోల్స్ లో నటించింది. మిస్టర్ బచ్చన్ సినిమాకు గాను బెస్ట్ ఫీ మేల్ డెబ్యూ ఫర్ తెలుగు అవార్డు అందుకుంది. మరి తాజాగా చేస్తున్న లేడీ ఓరియెంటెడ్ సినిమా భాగ్యశ్రీలోని నయా యాంగిల్‌ను చూపించడం ఖాయమైనట్టేనని ఈ వార్త క్లారిటీ ఇచ్చేస్తుది. మరి భాగ్యశ్రీ ఎలాంటి కథాంశంతో ప్రేక్షకుల ముందుకొస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# లవన్ ఇన్సూరెన్స్ కంపెనీ విడుదల వాయిదా




తెలుగు, తమిళ ఇండస్ట్రీల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న సెలబ్రిటీల్లో టాప్‌లో ఉంటాడు ప్రదీప్ రంగనాథన్. గతేడాది లవ్‌టుడే సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ యాక్టర్ ఇప్పటికే డ్రాగన్ , డ్యూడ్ సినిమాలతో మంచి హిట్స్ ఖాతాలో వేసుకున్నాడు. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తున్న చిత్రం లవ్ ఇన్సురెన్స్ కంపెనీ. ఈ సినిమాకు నయనతార భర్త విగ్నేష్ శివన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ చిత్రాన్ని డిసెంబర్ 18న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఎవరూ ఊహించని విధంగా రిలీజ్ వాయిదా పడ్డది. మూవీ త్వరలోనే విడుదల కానుందని యూఎస్ డిస్టిబ్యూషన్ కంపెనీ అధికారికంగా ప్రకటించింది. అయితే కొత్త తేదీ ఎప్పుడనేది మాత్రం చెప్పలేదు. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. తాజా టాక్ ప్రకారం ఈ మూవీని వాలెంటైన్ వీక్‌లో వచ్చే ఫిబ్రవరిలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై ఎస్ ఎస్ లలిత్ కుమార్‌తో కలిసి నయనతార నిర్మిస్తుంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, కృతి శెట్టి, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్, షారా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌లో భవిష్యత్‌లో(2040) ప్రేమ ఎలా ఉండబోతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుందని హింట్ ఇచ్చారు విఘ్నేశ్ శివన్ టీం.



# బాలీవుడ్ వైపు కాంతారా.. కాంత చూపు

కాంతార చాప్టర్ 1 సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణి వసంత్ ఇప్పుడు కొత్త దిశగా అడుగులు వేస్తోంది. కాంతార చాప్టర్ 1 చిత్రంలో యువరాణి కనకవతి అనే ప్రతినాయిక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన రుక్మిణి, తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా హిట్ ఇచ్చిన ఆనందాన్ని ఇప్పటికీ ఆస్వాదిస్తున్నట్లు వెల్లడించింది. తెలుగు, కన్నడ చిత్రసీమలకు ఇప్పటికే పరిచయమైన ఈ బ్యూటీ, ఇప్పుడు బాలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో తమిళ చిత్రాల్లోనూ క్రేజీ ఆఫర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు సమాచారం. బాలీవుడ్‌పై తన ఆసక్తిని బహిరంగంగానే వ్యక్తం చేసిన రుక్మిణి, హిందీ భాషతో తనకున్న అనుబంధమే అక్కడ నటించాలనే తపనకు కారణమని చెప్పింది. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. 'హిందీ నాకు చిన్నప్పటి నుంచే పరిచయం ఉన్న భాష. మా కుటుంబానికి సైనిక నేపథ్యం ఉండటంతో, వివిధ కంటోన్మెంట్ల మధ్య అనుసంధాన భాషగా హిందీ ఉండేది. అందుకే ఆ భాషపై నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇప్పటివరకు హిందీలో నటించే అవకాశం రాలేదు. కానీ, ఆ భాషలో నా ప్రతిభను నిరూపించుకోవాలని చాలా ఉత్సాహంగా ఉన్నాను. దేవుడి దయతో త్వరలోనే ఆ ప్రయాణం ప్రారంభమవుతుందని ఆశిస్తున్నాను' అని తెలిపింది. రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన కాంతార చాప్టర్ 1 విడుదలై సంచలన విజయం సాధించగా, ఇందులో రుక్మిణి వసంత్ ప్రతినాయిక పాత్రలో కనిపించి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఆమె అందచందాలు, నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ప్రస్తుతం ఈ సినిమా విజయం ఇచ్చిన ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నానని చెప్పిన రుక్మిణి, త్వరలో కాంతార టీమ్ అంతా కలిసి విజయోత్సవాన్ని జరుపుకుంటామని వెల్లడించింది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, జార్ఖండ్ సహా దేశం నలుమూలల నుంచి వస్తున్న స్పందనలు తనను ఎంతో ఉత్సాహపరుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బాలీవుడ్ ఎంట్రీతో పాటు దక్షిణాది భాషల్లోనూ రుక్మిణి వసంత్ కెరీర్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.